# క్రికెట్టు క్రీగంటి చూపులు

ఆర్. ఎం. చిదంబరం



'స్ర్రుమంటూ ఎ ర్ర టి బంతి స్పుట్నిక్ వేగంతో దూసుకువచ్చింది. దానిమీదే దృష్టిని కేంద్రీకరించి, బాట్‌తో దాని వేగాన్ని తగ్గించి పొగరణచి, తృప్తిగా నిట్టూర్చాడు గిరి. దాని మిడిసిపాటు చూస్తే తన 'వికెట్ను' కొండరీ దాకా ఎడతా యనుకున్నాడు. గండం తప్పిందన్న ఆనందం అత న్నావరించింది. మరు క్షణం మైదా నంలో ఉన్న ఆటగాళ్ళందరూ కలిసి ఏకకంఠంతో 'హౌ ఈజ్ దట్' అనరిచారు. గిరి ఉలిక్కిపడి, ఊహాలోకాన్ని వదిలి వచ్చాడు, ఎదురుగా యమ ధర్మరాజులా 'అంపైర్' కనబడ్డాడు. చూస్తూ, చూస్తూ ఉండగానే అతని చూపులు వేలుపైకి కదిలి, ఆకాశాన్ని చూడమంది. అంతే, పాపం! గిరి అవుట్! బాట్ చేసేందుకు కాలికి కవచం కట్టుకున్నంతసేపైనా ఆడలేదు. మొట్టమొదటి బంతికే బండి వెనక్కి తిప్పవలసి వచ్చింది. తల వంచుకుని వెనక్కు బయలుదేరాడు. కొందరు హేళనగా నవ్వారు. మరికొందరు సానుభూతిగా పెదవులు చప్పరించారు. మిగిలినవారు ఎగిరి గంతు లేశారు. ఒక్క పరుగైనా చేయకుండా వోడి పోయాడు. మనసు చీకాకుతో నిండిపోయింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. కాళ్ళు తేలిపోయాయి. ఎదురుగా కంపెనీ మానేజరు అతనికేసే చూడటం గమనించటంతో 'అమ్మోయ్' అని కేకేసి నేల కొరిగాడు.

'ఠంగ్!'

గ్లాసు కిందపడి సంగీతం పాడి ఓ మూలకు చేరింది. గిరి లేచి కూర్చుని కళ్ళు నులుముకున్నాడు. కేరింతలు కొట్టిన ఆ జన సమూహం ఏది? కాలభైరవుడిలా పరుగెత్తుకు వచ్చి బౌలుచేసిన ఆ 'తుఫాను వీరు' జేడి? .... ఎవరూ కనపడరేం?—కుర్చీ, బల్ల, పుస్తకాల బీరువా, రేడియో.

'ఛట్! .... ఇంతాచేసి కలన్నమాట!' అని నవ్వుకున్నాడు గిరి.

అయితేనేం? .... గిరికి మరో బెంగ పట్టుకుంది. పగటి కలలు నిజమవుతాయని ఎవరో ఎప్పుడో అనగా విన్నాడు. నిజంగా కల నిజమైతే తనగతేంకాను? అతని కంపెనీ తరపున పైన

ల్సికు మద్రాసు వెళ్ళాలి.

'గిరి! నువ్వుమన జట్టుకి వెన్నెముకలాంటి వాడివి. ముఖస్తుతి కాదుసుమా ! .... నీ మీదే జయాపజయాలు ఆధారపడి ఉన్నాయి. 'విష్ యు గుడ్ లక్' అన్న మేనేజరు వాక్యాలు అతనికి పదేపదే వినిపించాయి. ఆ క్షణంలో విక్రమార్కుని సింహాసనం దొరికినంత సంబరం కలిగింది. తనమీద అందరూ ఆశపెట్టుకున్నారు.

'పోనీలే ! .... రెండో ఇన్నింగు ఉండనే ఉంది'. అని 'గుడ్డిలో మెల్ల' పడ్డాడు.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, నేలమీద పడి మూలుగుతూన్న గ్లాసును యథాస్థానంలో ఉంచాడు. తలుపుకు పైనున్న వెంటిలేటర్లోంచి రెండు కవర్లు నేలమీదకు ఎగురుతూ వచ్చి పడ్డాయి. మొదటి ఉత్తరం మీది దస్తూరీ చూడగానే ఎక్కడనుండి వచ్చింది తెలిసిపోయింది. రెండో ఉత్తరం ఉనికి చూసీ చూడటంతో తెలిసి రాలేదు. కాని ఆ దస్తూరీ మాత్రం మంచు తెరలో వస్తువులా ఎక్కడో చూసినట్టే ఉంది. నాన్న రాసిన మొదటి ఉత్తరం చదువుకున్నాడు. అందులో కొత్త విషయాలు ఏవీ లేవు. దీవెనలతో ఆరంభమై, ఆరోగ్యాన్ని పలుకరించి పెళ్ళి ప్రస్తావనలో దిగింది. గత రెండు సంవత్సరాలుగా వచ్చి పడుతున్న సంబంధాలమీద 'విశ్వామిత్ర దృష్టి' వేసినందుకు అక్షింతలు—

'బ్రహ్మచారి ముదిరినా ....' వంటి సామితలు. 'హోటలు పక్షిగా' ఎందుకు బతకాలన్న ప్రశ్నలు—'జరాభారంచేత జవసత్వా లుడిగిన' తల్లిదండ్రుల మాటను మన్నింపమని హెచ్చరిక—ఇవేమీ బాగు పడే లక్షణాలు కావని, కాస్త నిందాగర్భితమైన విసురులు—కనుక 'ఎవతెనో, ఒకతెను—వనితను' చేపట్టి 'ఇంటివాడి' ననిపించుకోమని ముగింపు—ఇలా రకరకాల భావాలతో, బెదరింపులతో కూడిన ఆ ఉత్తరం అరవ్వాడి 'అవియల్' కూరలా తయారైంది. స్కూలుఫైనలు చదివే విద్యార్థి చేతికి ఆ ఉత్తరాన్నిచ్చి మూడో వంతుకు సంక్షిప్తం చేయమంటే 'మూడోవంతుదాకా ఎందుకయ్యా ? మూడు మాటల్లో ముగిస్తాను. నువ్వు పెళ్ళి చేసుకో—' అంటాడు.

గిరి విసుక్కోలేదు. కోపగించుకోలేదు. టేబిలు డ్రాయరులోంచి రెండు ఫైళ్ళు తీశాడు. మొదటి ఫైలు మీద 'నాన్న వద్ద నుండి' అని రాసి ఉంది. చదివి ముగించిన ఉత్తరాన్ని ఫైలు చేశాడు. పెళ్ళినిగురించి నాన్న దగ్గర్నుండి వచ్చిన పదహారో ఉత్తరం అది. రెండో ఫైలుమీద 'నాన్నకు' అని రాసుంది. అవన్నీ తను నాన్నకు అదేసబ్జెక్టు మీద రాసిన ఉత్తరాలు. 'రైటింగ్ పాడ్'లోంచి సర్రున కాగితం చింపి జవాబు రాశాడు.

'గత రెండు సంవత్సరాలుగా, సరాసరిన నెలకొకటి చొప్పున రాసిన ఉత్తరాల్లో ప్రతిపాదిస్తూ వచ్చిన 'పాలసీ' లో ఎలాంటి మార్పు లేదని మొదలుపెట్టాడు. 'పెళ్ళనేది అవసరం. కానది జీవితంలో పైకివచ్చే అవకాశాలకు ఆటంకంగా ఉండే పక్షంలో అనవసరం. విసర్జనీయం. జీవితలక్ష్యాన్ని సాధించాక ఏ పని లేకుండా కాలాన్ని చంపలేక' అవస్థపడే మనుష్యులే పెళ్ళి చేసుకోవాలి. ఎందుకంటే పెళ్ళయాక మగపిల్లవాడు యితరుల ఆలోచనలమీద, అధికారం మీద ఆధారపడివుంటాడు. వ్యక్తిత్వం నశిస్తుంది. నా విషయంలో నే నింకా అనుకున్న గమ్యస్థానం చేరుకోలేదు. గొప్ప క్రికెట్ ఆటగాణ్ణి కావాలన్న నా కోరిక సగం వరకే పూర్తయింది. అంతవరకూ పెళ్ళిమాట ఎత్తవద్దని ప్రార్థిస్తున్నా' అన్నాడు గిరి. ఉత్తరం కాపీ ఫైలు చేసి కవరు అంటించేశాడు. ఇక నెల రోజులవరకూ ఈ 'టాపిక్' ముట్టనక్కర్లేదన్న సంతోషంతో కుర్చీకి జారబడి ఆవులించినప్పుడు టేబిలుమీద ఉన్న రెండో ఉత్తరం కనపడింది

'డియర్ గిరి—



## క్రికెట్టూ – క్రీగంటి చూపులూ

ఈ ఉత్తరం చూడగానే ఎవరు రాసింది చెప్ప గలిగుండాలి. లేకపోతే నన్ను మర్చిపోయావన్నమాట. అంటే మన చిరకాల స్నేహితాన్ని తుంచివేశావన్నమాట. అంటే పెరిగి పెద్దదై వుష్పించే మొక్కను మొదలంట నరికివేశావన్నమాట.

గిరికి వళ్ళు మండింది.

'నీ తలకాయన్నమాట .... ఎవర్రా ఈ ఉత్తరం రాసింది ?' అని చివర చేవ్రాలు చూశాను.

'హరిసీ ! .... నువ్వట్రా ! .... నరహరి ! .... ఎంత కాలానికెంత కాలానికి !' అని హరి ఎదురుగా వచ్చినట్టు తను కావలించుకున్నట్టు భావించి పరమానందభరితుడై ఉత్తరం చదువుకున్నాడు.

'సరే .... ఇప్పుడు తెలిసిందన్నమాట. నీకు తరుచు ఉత్తరాలు రాయాలని, గగనకుసుమమవుతున్న మన చెలిమిని 'భూ కుసుమం' చేయాలని అనుకోటం, అవాంతరం వచ్చిపడటం, ఇలా ఈ రెండేళ్ళుగా జరుగుతూ వచ్చింది. అదీగాక, ఇంతకాలంగా నువ్వెక్కడున్నదీ నాకు మొన్ననే మీ నాన్నగారు కనిపించి చెప్పారు..... ఆ తరువాత ఆయన్ని నాలుగైదుసార్లు కలుసుకున్నాను. నీ పెళ్లి గురించే ప్రస్తావించాం.'

గిరి ఉలిక్కిపడ్డాడు. ఉన్న రెండు ఫైళ్ళు చాలక 'హరి దగ్గర్నుండి' అని పెళ్లి సబ్జక్టు మీద మరో ఫైలు తెరవాలి గామోలని గజగజలాడిపోయాడు. ముందుకు పోగక తప్పదు.

'నీ అభిప్రాయాలు వివరించారు. నువ్వు క్రికెట్ ఆటలో అఖండవిజయం సాధించి, నీ నామం దేశదేశాలు పాకి పరుగెత్తాలని వెర్రి కలలు కంటున్నావని వాపోయారు. నీ లక్ష్యాన్ని అంగీకరించాను. కాని ఓనాడు కాకపోతే ఓనాడు ఒంటరితనం వదులుకోవలసిందే కదా ! అయినా ఉత్త వెర్రినాగమ్మలా ఉన్నావు. క్రికెట్‌కూ, జీవితానికి ఏవిటి సంబంధం ? నీ దృక్పధాన్ని వారం రోజుల్లో మారుస్తానని మీ నాన్నగారి ముందు శపథం చేశాను. అది నెరవేరుతుందో లేదో...

ఆ సంగతి వదిలేయి. నీ నుండి ఓ సాయం ఆశించి ఈ ఉత్తరం రాస్తున్నా. మా ఆవిడ అర్జంటుగా మద్రాసు వెళ్లవలసి వచ్చింది. రేపే బయలుదేరి తీరాలి. నాకు సెలవు దొరకదు. ఒంటరిగా వెళ్లటానికి దానికి వల్లమాలిన భయం. ఒట్టి పిరికిపంద. మా యింటికి పదిళ్లవతల ఉన్న చుట్టాలింటికి వెళ్లటమంటే కీకారణ్యాన్ని దాటినట్టే. కనుక ఆమె సాయం లేకుండా మద్రాసు వెళుతుం దనుకోటంకల్ల. బెజవాడ ఎలాగో పంపిస్తాను. నువ్వు మీ కంపెనీ తరపున క్రికెట్ ఆడేందుకు వెడుతున్నావని, శనివారం బయలుదేరుతున్నావని విని ఆమెను మద్రాసు దాకా దిగబెట్టమని ప్రార్థిస్తున్నా. మన చిరకాల స్నేహితాన్ని పురస్కరించుకుని ఈ ఉపకారం చేస్తావని ఆశిస్తున్నా. 'కాదు కూడ' దని ఎదురు చెప్పవన్న ధీమాతో ఆమెను పంపిస్తున్నా.

గిరికి వళ్ళు భగభగమంది. శుభకార్యానికి పిల్లెదురు. మిత్రులతో కలిసి ఆదివారం హాయిగా, కులాసాగా వెడదా మనుకుంటే ఇతగాడి కోసం శనివారమే బయలుదేరాలట ....ఈ బాధ్యత వహించటం తనతరం కాదని 'కుండ బద్దలు' కొడదా మనుకుంటే అవధి లేదాయె. అదీకాక నరహరితో అతనికున్న చెలిమి 'అలాంటిది, ఇలాంటిది' కాదు. సిసలైనది. చీకటి వెలుగులకు మల్లే శాశ్వతమైనది. కాలేజీలో చదివే రోజుల్లో ఆర్థికంగా నైతికంగా అండగా నిలిచి క్లిష్టపరిస్థితుల్లో ఆదుకుని గట్టెక్కించాడు. అలాంటి మిత్రుడికి ఈ చిన్న ఉపకారం చేయలేకపోతే ఎలా ? .... శనివారం—అంటే ఆనాడే బయలుదేరటానికి నిశ్చయించుకున్నాడు.

కాని, గిరికి గిరిలాంటి మరో సందేహం వచ్చింది.

హరి పెళ్లికి తను వెళ్లలేదు. కనుక అతని భార్య ఎలా ఉంటుందో తనికి తెలియదు. బెజవాడ ప్లాటుఫారంమీదున్న అమ్మాయిల్లో హరి భార్యను కనుక్కోటం ఎలా ? 'పులి నోట్లోంచి తల తీసి సింహం నోట్లో ఉంచినట్లు ఏమిటీ చిక్కు ?' అని ఆలోచిస్తుండగా ఉత్తరం నేలకు జేరి బోర్లా పడుకుంది. పొరబాటున ఉత్తరం రెండోవేపు చదువుకోలేదన్న విషయం అప్పటిక్కాని తెలియలేదు. నరసింహం నిజంగా బుద్ధిమంతుడు.

'మా ఆవిణ్ణి నువ్వింతవరకు చూడలేదని నాకు తెలుసు. అందుకని గుర్తులు రాస్తున్నా. గులాబీ రంగు చీర, నల్లటి చుక్కల బార్డరు, అదే రంగు జాకెట్టు, నుదుటిమీద అర్ధచంద్రాకారపు బొట్టు, చేతిలో నీలిరంగు 'హాండ్ బాగ్', ఎడంచేతికి ఆరు బంగారు గాజులు, కుడిచేతికి ప్లాస్టిక్ రాళ్ళు తాడిగిన చెయిన్‌లో కూడా వాచీ, ఇవన్నీ ఆమెను గుర్తుపట్టేందుకు సహకరిస్తాయి. ఇందులో కొన్ని గుర్తులున్న అమ్మాయి ఎదురు పడొచ్చు కానీ, అన్ని ఉన్నది మా ఆవిడే ! ఆమెను కనుక్కోటంలో నీ కెలాంటి యిబ్బందీ ఉండదని తలుస్తాను.'

గిరి మేనేజర్ని కలుసుకుని, ఏదో పని ఉండటం వలన ఒకరోజు ముందుగానే బయలుదేరవలసి వచ్చిందని, అనుమతి తీసుకుని సూట్‌కేస్‌తో స్టేషనులో హాజరయ్యాడు. అప్పుడే మచిలీపట్నంబండి వచ్చిపోయింది. ప్రయాణీకులు గుంపులు గుంపులుగా వస్తున్నారు. గిరి, హరి ఉత్తరం మరోమారు చదువుకుని గుర్తులన్నీ కంఠస్థం చేశాడు. వళ్లంతా కళ్ళు చేసుకుని, ప్లాటుఫారం ఆ చివర్నుంచి ఈ చివరిదాకా రెండుసార్లు తిరిగాడు. వెదికాడు. ఎక్కడా జాడ లేదు. ఎందరో అమ్మాయిలు కదిలిపోయారు..... ఒకవేళ హరి తన్ను ఏడిపించటానికి ఈ ఎత్తు ఎత్తాడేమో ! .... ఛీ ! వేళాకోళానికైనా ఓ అంతు ఉంటుంది. అలా ఎన్నటికీ చేయడు. ఏం చేయటానికి తోచక ఆలోచిస్తున్న సమయంలో ఆ అమ్మాయి కెరటంలా ముందుకు కదిలి రావటం చూశాడు.

'గులాబీరంగు చీర .... బార్డరు ? .... నలుపు రంగు—రైట్. జాకెట్టు అదే రంగు. అంతవరకూ సరి—బొట్టు దూరం నుండి కనపడటం లేదు. ఒకటి. రెండు .... ఆరంటే, ఆరుగాజాలున్నాయి. వెరీ కరెక్ట్. నీలిరంగు హాండ్‌బాగ్.'

గిరి లేచి నిలబడ్డాడు. అతనికి కొంచెం జంకుగా ఉంది. ఆమెతో జాగ్రత్తగా మాట్లాడాలని, హరి తన మంచితనాన్ని మెచ్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. పెళ్లికాని పిల్లతో మాట్లాడటం వేరు. మొగుడున్న మగువతో మెలగటం వేరు.

దగ్గరకు రానే వచ్చింది.

'నమస్కారం ....' అన్నాడు అర్ధ చంద్రాకారపు బొట్టు చూస్తూ ఆమె కెదురుగా నిలబడి

ఆ అమ్మాయి కొంత ఆశ్చర్యపడ్డట్టు కనిపించి ప్రతి నమస్కారం చేసింది.

'నా పేరు శేషగిరి. నరహరి ఉత్తరం రాశాడు. మీరు భయంలేకుండా నాతో మద్రాసు రావచ్చు. మీకు అన్నయ్యలాంటి వాడిని.... టిక్కట్టు కొన్నారా ?'

ఆ అమ్మాయి నవ్వు నాలుగువైపులా పరుగెత్తింది.

'ఓ ! .... మీరేనా ? .... ఆయనే కొనిచ్చారు. పాపం ! మిమ్మల్ని శ్రమపెట్టాల్సి వస్తోంది. ఏం చేయటం చెప్పండి. నాకు ఒంటరిగా ప్రయాణం చేయటమంటే మహా చెడ్డ భయం. నా కంటె వయస్సు సగం చిన్నవాళ్ళు కూడా ఒంటరిగా భూప్రదక్షిణం చేసి వస్తున్నారు. బెజవాడ నుండి మద్రాసు వెళ్లలేనని చెప్పుకుంటే సిగ్గు ....'

(57 వ పేజి చూడండి)

స్కూలు భవనం కాలిపోతూంది. ఇది గమనిస్తూ నిలబడివున్న ఇద్దరు పిల్లల్లో ఒకడు వున్నట్లుండి ఏడుపు లంకించుకున్నాడు.

రెండవవాడు:-"ఏమిటి బ్రదర్! ఏడుస్తావెందుకోయ్! స్కూలు కాలిపోతే మనకే గదటోయ్ జాలీ. మళ్లీ స్కూలు కట్టేంతవరకు మనకు సెలవు లేగా!!

మొదటివాడు:- వెఱ్ఱి నా తండ్రీ! అది సరే. అందుకు కాదురా నేనేడవడం. మరి మాస్టర్లంతా బయటే వుండి పోయారే!

"రమ" (కడప)

# క్రికెట్టూ — క్రీగంటి చూపులూ

(10 వ పేజీ తరువాయి)

'అలా అనకండి. రోజులు మంచివికావు. ప్రతి క్షణం అనుకోని ప్రమాదంతో నిండివుంది. ఖూనీలు, దారి దోపిడీలు ఇవి రోజు రోజుకీ ఎక్కువవుతున్నాయి. అందుకు మీ కారణమంటూ అవుసరం లేదు..'

'మీకు పుణ్యం ఉంటుంది మీరు మరీ భయపెట్టేస్తున్నారు'

'నో .... నో ... అలాంటిదేం లేదు. బండి పావు గంటలో వస్తుంది. అలా ముందుకు పోదాం'

గిరి వెనక, ఆమె ముందు నడిచారు

'హరి అదృష్టవంతుడు' అనుకున్నాడు ఆమెను చూశాక. అందంతోబాటు నడకలో చిత్రమైన ఆకర్షణ కవులు వర్ణించినట్టు 'గజగమన', 'హంస గమన' కాక 'మరేదో' తీరుగా ఉంది

'ఆరెంజ్ తాగుతారా ?' అనడిగాడు రెస్టారెంట్ దగ్గరకు రాగానే

ఆమె వద్దంటూనే తీసుకుంది.

'మీ పేరు అడగలేదు సుమండీ ....'

'గౌరి .... ఆయన రాయనేలేదా ?'

ఇద్దరూ వెయిటింగ్‌రూంలో కూర్చున్నారు. బండి వచ్చేందుకు పది నిముషా లుంది.

'మీకు క్రికెట్ అంటే అమితమైన ....' అని నవ్వేసింది గౌరి

గిరి, తను గిరంత ఎత్తున నిలబడి భూమ్మీద మనుషుల్ని చీమల్లా చూసినట్టు వూహించుకున్నాడు.

'అభిమానం ... కాదు . ఓ పిచ్చి హరి చెప్పే ఉంటాడు కంపెనీ తరఫున ఫైనల్సు ఆడేందుకు వెడుతున్నాను నన్ను నేను స్తుతించుకోటం బాగుండదు కాని 'నువ్వు మన జట్టుకు వెన్నెముకలాంటి వాడి' వని మేనేజరే అన్నారు'

గౌరి ఆశ్చర్యపడుతున్నట్టు రెండుసార్లు కను రెప్పలు 'టపటప' లాడించి, పెదవ పెదవి విరిచి, 'మిమ్మల్ని నిరుత్సాహ పరుస్తున్నా ననుకోకండి అయినా ఈ ఆటలో ఏముందండి ? నిముషానికో బంతి విసరటం—బాట్‌తో దాన్ని ఆపటం రోజంతా ఎండలో మలమల మాడటం అంతకు మించి మిగిలిం దేముంది ? . వట్టి బోరింగ్. మీరు టెన్నిస్ ఆడినా బాగుండిపోను బోలెడంత ఏక్షన్ ఉంది క్రికెట్‌లో కదలిక సున్న .' అంది.

ఆశించని జవాబు—గిరి కోపాన్ని సభ్యతకోసం చంపుకున్నాడు

అతను తల్చుకుంటే గౌరిని గిరగిర తిప్పి ఒప్పించవచ్చు

'కొన్ని గంటల ప్రయాణం ఆ తరువాత ఎవరి దారి వారిది వసపిట్టలా వాగుతుంది మన కెందుకు' అని ఊరుకున్నాడు ఇంత స్వేచ్ఛగా ధైర్యంగా మాట్లాడే గౌరిని 'పిరికిపంద'ని, పదిళ్లవతల ఉన్న చుటాలింటికి వెళ్లలేద'ని వ్యాఖ్యానించిన హరిని చూసి జాలిపడ్డాడు

భార్య నతను పూర్తిగా అర్థం చేసుకోలేదు గామోలు!

ఇక సంభాషణ సాగేందుక వీల్లేకుండా రైలు వచ్చేసింది

ఆ పెట్టెలో మిగిలివున్న ఒక్కగా నొక్క సీటులో ముందే తన సూట్‌కేసును కూర్చో

సంతోషిస్తూ.

'మరి మీరు ? .... ' అంది మర్యాదకోసం.

'నేను నిలబడతాను. మరేం ఫరవాలేదు. ఇద్దరం 'నువ్వు నువ్వ' ని వాదించుకుంటే మూడో వ్యక్తి దాన్ని తన్నుకుపోతాడు.'

గౌరి కిటికీవారగా కూర్చుంది. గిరి ఆమె పెక్కె సీటుకింద సర్దాడు. చెంపకు చేయి ఆనించి పటుత్వం కోల్పోయిన సూర్యకిరణాలను ధైర్యంగా ఎదుర్కొనే గౌరిని చూసి, మరీ మరీ చూడా లనుకుని, మ ర్యా ద కా ద ని మానుకున్నాడు. ఆ కోణంలో గౌరి మరింత అందంగా కనిపించింది.

గిరిని ఎవరో వీపు చరిచి పిలిచినట్టయింది. చుట్టూ చూసి ఎవరూ కనిపించక తన భ్రమేమో ననుకున్నాడు ప్రయాణికులు ఎవరి బాధలో వారున్నారు.

బండి రెండు స్టేషనులు దాటేసరికి ప్రకృతి శృంగారం పూర్తి చేసుకుంది ఎర్రటి బట్టకు బదులు రంగు రంగుల వస్త్రాలు తొడుక్కుంది. వాడినపూలు/ తీసిపారేసి కొత్తపూలు, పెట్టుకుంది తన్నింతసేవూ ఎండలో ఎండబెటిన సూర్యుణ్ణి కోపంతో అగ్నిగుండంలో విసిరేసింది. చీకటి మాత్రం ఇదంతా దొంగతనంగా కనిపెడుతూ ప్రకృతిని పొట్టబెట్టుకోటానికి అవకాశం కోసం ఎదురుచూస్తోంది తెల్లవన్నీ పాలని నమ్మి పిచ్చిగా గాలికి వూలు కదులుతూండగా ప్రేమ గీతాలు పాడుకుంటోంది .. గిరి నిరాశగా చుట్టూ చూశాడు. అరగంట గడిచింది నిలబడి ప్రయాణం చేయటం మహ యిబ్బందిగా ఉంది అనుకున్నట్టు ఆదివారం బయలుదేరితే సరదాగా ఉండేది తమకోసం కంపెనీ ఓ చిన్న పెట్టె రిజర్వుచేసింది కూడా — ఈలోగా హరి ఉత్తరం— ఈ బాధ్యత—అన్నీ తన ఉత్సాహాన్ని సగం చంపేశాయి. సోమవారం ఫైనల్సు ప్రారంభం. అలా ఆలోచిస్తూ ఎటో చూస్తూ నిలబడ్డాడు.

'ఇలా వచ్చి కూర్చోండి' అంది గౌరి

ఆ స్టేషనులో చాలామంది ప్రయాణికులు దిగిపోయారు పెట్టె సగం ఖాళీ అయింది గౌరి కెదురుగా ఓ సీటు ఖాళీగా వుంది

'ఎందుకులెండి, ఇక్కడే కూర్చుంటాను' అన్నాడు ఆమెకు దూరంగా వున్న సీటుకేసి వెడుతూ ఎదురుగా కూర్చోటానికి కాస్త భయపడి—

'మీ కిష్టం లేనప్పుడు నన్ను తీసికెడతానని ఆయనతో ఎందుకు చెప్పాలి ? నాతో మాత్రం ఎందుకనాలి ? మీకంత యిబ్బందిగా ఉంటే మరో పెట్టె చూసుకోవచ్చుగా నా గురించి శ్రమపడకండి'

ఆమె కంఠంలో కోపాన్ని గుర్తించాడు గిరి

'నో .. నో ... మీరలా అనుకోకూడదు'

గటం అతని కంతగా అలవాటు లేదు. ఈమారెవరో మళ్లీ వీపు గట్టిగా చరచి 'గిరి ! ఒరేయ్ గిరి !' అని పిలిచారు అయిదు నిమిషాల్రకితం అదెవరో గుర్తించలేక పోయినా, ఇప్పుడు తెలుసుకున్నాడు అతని 'లోపలి గిరి'.

'ఎందుకయ్యా నా వీపు ఇలా చిట్లకొడతావ్ ? నీకేం పోయేకాల మొచ్చింది ?' అని విసుక్కున్నాడు.

'నాకు పోయేకాల మొస్తే నువ్వు బతికే దెలాగరా నాయనా ? ... ఇద్దరం ఒక్కటే ! నీ అంతర్భాగం నేను—నా అంతర్భాగం నువ్వు తెలిసిందా ? గౌరి గు రి ం చి అంత ఘాటుగా ఆలోచించవలసిన అవుసర మేమొచ్చింది ?

ప్రేమించి పెళ్లిచేసుకుంటావా ? .... ఓరి చవట నాయనా ! జాగ్రత్త ! ఆమెకు పెళ్లయింది. కబడ్దార్ !'

గిరి వెనక్కి తగ్గాడు ఈ లోపలి గిరితో అసలు వాదించకూడదు. శివుని ఆత్మలింగంలా వాదించేకొలదీ పెరిగిపోతాడు

రైలు ఉత్సాహంతో పిచ్చిగా ఏదో పాడుకుంటూ కదలిపోతోంది గిరి 'స్వంత' ఆలోచనల్లో పడిపోయాడు. ఫైనల్సులో తమ కంపెనీ గెలిచినట్టు, పెద్ద షీల్డును మోయలేక అందుకున్నటూ వూహిస్తూంటే పెదవులు చిరునవ్వులు తగిలించుకున్నాయి.

గౌరి ఫక్కున నవ్వింది.

'ఏం ? .... ఏం ? .... ఏమైంది ?' అని కంగారు పడ్డాడు.

'అబ్బే ! ఏంలేదు మీ క్రికెట్ గురించి ఆలోచిస్తుంటే నవ్వొస్తుంది అరగంట కష్టపడి కాళ్లకూ, చేతులకూ ఏవేవో కట్టుకుని యుద్ధ రంగంలో మహావీరుడిలా వెడతారు మొట్ట మొదటి బంతికే తిరుగుముఖం పట్టి ఏడుపు మొహం వేస్తారు అదే మరో ఆట తీసుకోండి . గంటో, గంటన్నరో తప్పనిసరిగా ఆడి తీరాల్సిందే. అందుకే నవ్వుకున్నా—ఏమీ అనుకోకండి'

గిరి మాట్లాడలేదు అ త ని కి పొద్దుటికల కళ్లముందు గిరగిర తిరిగింది అన్నీ అపశకునాలు.

ఆమె కెదురుగా కూర్చోటం ముళ్లమీదున్నట్టుంది క్రూరమృగంతో పోరాడి గెలవ్వొచ్చు వి ష స ర్పా న్ని వంగదీయవచ్చు. పర్వతాన్ని పిండిచేయువచ్చు కాని మహాప్రభో ! ఆడుదానితో మాట్లాడి గెలవటం కల్ల అందులోనూ పె ళ్ల యి న అమ్మాయితో ఎలా మాట్లాడినా, ఎలా ప్రవర్తించినా చిక్కే మాట్లాడక మౌనంలో దాక్కున్నా చిక్కే హరికోసం 'హరీ' మంటూ వూరుకోవలసిందే

'క్రికెట్ గురించి ఆమె అసందర్భపు మాటలు రెండుసార్లు విన్నాను మన్నించాను మూడోసారి వూరుకొనేది లేదు' అనుకున్నాడు పదేపదే

చీకటిపడింది నల్లకాగితంమీద బం గా రు ముద్దల్లా దీపాలు చెల్లాచెదరై వెనక్కి కదలుతున్నాయి చల్లగాలి మనసును, శరీరాన్ని వశం చేసుకుని 'నిన్ను ని ద్ర లో కి విసిరేయకపోతే నాపేరు గాలికాదు' అని సవాలు చేసింది గిరికి ఆకలేసింది బండి ఆగగానే ఏదైనా కొనుక్కు రావాలి ఆమె తింటుందో, తిరస్కరిస్తుందో.

తింది. చెదరిన ముంగురులు సర్దుకున్నాయి.

గాలి కాస్త కినిసి గిరిని చుట్టేసి మత్తుమందు చల్లి కునుకులో విసిరేసింది

'టైమెంతయిందమ్మా ?....' ఎవరో ముసలామె గౌరి నడిగింది.

అప్పటికే గిరి మేలుకున్నాడు కిటికీకి జారబడి కళ్ళుమాత్రం తెరవలేదు

'నా దగ్గర వాచీ లేదండి .. ఇది వాచీలా కనిపించే గాజు సుమారు ఏడున్నరవుతోంది' అంది గౌరి నవ్వుతూ

"ఇది మరీ చోద్యంతల్లి! నీ చేతికున్నది వాచీ కాదని నాకు తెలియదా ఏమిటి? మీ ఆయన చేతికి తాటికాయంత వాచీ వుందికదా! చూసి చెబుతావని అడగాను '

గిరి గుండెలు ఆగి మళ్ళీ కొట్టుకున్నాయి గౌరి ఏం సమాధానం చెబుతుందోనని చెవులు 'అటెన్షన్' పొజిషన్‌లో నిలబడ్డాయి

'అతను మా ఆయనని మీ కెవరు చెప్పారు? ఆడ మగ కలిసి మాట్లాడుకుంటే, ఆలుమగలేనా ఏమిటి? మీలాంటి వక్రబుద్ధులకు వేరేపని వుండదు అన్నా చెల్లెలు ఎందుక్కాకూడదు. బంధుత్వం లేకపోయినా తెలిసిన వారెందుక్కాకూడదు? మీక్కావలసింది టైము—నా స్వవిషయం మీ కెందుకు? అదీకాక నేను వివాహితను. నోరు దగ్గర పెట్టుకుని మసలు కోండి.' అని గౌరి కస్సు మంది. కాదు, కాదు. అలా అంటుంది గిరి వూహించాడు. అవును మరి పెళ్ళైన ఆడదానితో పరాయి మొగాడు 'నీ మొగుడు' అంటె వూరుకుంటుందా? తలతీసేస్తుంది.

"ఏడుంపావైందండి....' అంది నెమ్మదిగా గౌరి.

గిరి ఆశ్చర్యంతో కళ్ళుతెరిచాడు. గౌరి చిరునవ్వు నవ్వింది.

'నిద్ర ముగిసిందా?... మీ వాచీ సరిగ్గానడుస్తోందనుకుంటా. ఇందాకా ఓ ముసలామె టైమడిగితే చెప్పాను......"

"సెకను దగ్గర్నుండి ఆల్ కర్టెక్టు!' అన్నాడు గర్వంగా

'నిజమే నమ్మండి!. ...ఎంత క్కొన్నారు

గిరి మొదట్లో ఆమె ప్రశ్నకు సంశయించి నా జవాబు చెప్పాడు.

'షేక్స్పియర్‌లో మొదటి మార్కు వచ్చినందుకు మా నాన్నగారు ఆప్యాయంగా బహూకరించినది.'

'అలాగా?.... చాలా సంతోషం మీ పేరుకు తగ్గట్టు శరీరం ఎలాగూ లేదుకదా — పోనీ వాచీ అయినా పర్వంతంలా వుండాలనా ఈ తాటికాయ కొన్నారు ?...దయవుంచి దాన్ని అమ్మేసి, మరో చిన్న వాచీ కొనుక్కుంటే చూట్టానికి ముచ్చటగా వుంటుంది. టైమెంతయిందో సరిగ్గా చూసుకోండి

గౌరి ముసిముసి నవ్వులు నవ్వింది గిరి గడియారం కేసి చూస్తే ఎనిమిదిన్నరైంది ఆమె నవ్వు వెనక హేళన అర్థమైంది బండితో పాటు అది కూడా గంట ముందు నడుస్తోంది తనేమో 'సెకను దగ్గర్నుండి ఆల్ కరెక్ట్' అన్నాడు మరి. తన్ను తాను సమర్థించుకోటానికి ఏదో అనాలనుకుని ఏమీ

# క్రికెట్టూ — క్రీగంటి చూపులూ

అనక వూరుకున్నాడు అతని మనసంతా మల్లెపూవులా వికసించింది.

లోపలికి గిరి రంగంలోకి వచ్చాడు

'ఏమయ్యా గిరిరాజ్ ?.... వ్యవహారం ముదిరిపోతోందనుకుంటాను. గౌరి మరొకరి సొత్తన్న సంగతి మర్చిపోయావా? నీ ప్రవర్తన వారికి తెలిస్తే నీ గురించి ఏమనుకుంటాడు. మీ నాన్నకీ సంగతి తెలిస్తే నీ మీదున్న సదభిప్రాయం ఏమవుతుంది ? ఇవన్నీ కాస్తయినా ఆలోచించావా? ఆడువారు వలలు పన్ని బంధిస్తారు కాని బయటకు వచ్చే మార్గం చెప్పరు వలలో చిక్కుకున్నాక కంటికి కనపడరు. నీ అవస్థ నీది '

గిరికి శివమెత్తినట్లైంది. లోపలి గిరిని పాచి లెంపకాయ కొట్టాలనుకుని ధైర్యం చాలక వూరుకున్నాడు.

'నువ్వు చేస్తున్న నేరారోపణ సరైందికాదు ఆమె నన్ను సంభాషణలోకి దించుతోంది. ప్రయత్న పూర్వకంగా ఆమె ప్రమేయంకోసం ఎగబడుటలేదు. వాచీగురించి ఎలా ఎత్తి పొడిచిందో విన్నావుగా...'

'అదంతా నాకు తెలియదు. . మెలకువగా వుండమని హెచ్చరిస్తున్నా అంతే '

బండివేగం క్రమంగా తగ్గుతూ వచ్చింది పచ్చ సిగ్నలు పలుకరించింది. ప్లాటుఫారం బండికి దగ్గరగావచ్చి నిలబడింది. 'నాకు ఆకలేస్తోంది. ఏదైనా కొనుక్కువస్తాను.....మీరు అన్నంతింటారా లేక టిఫైను వగైరా....' అంటూ లేచి నిలబడ్డాడు. 'ముందు మీరు మీ సీట్లో కూర్చోండి' అని ఆజ్ఞాపించింది గౌరి.

సంచిలోంచి తినుబండారాలుతీసి రెండు ప్లేట్లలో సరిసమానంగా సర్దింది.అవన్నీ చూస్తుంటే నోరూరిన మాట నిజమే కాని, సభ్యతకోసం ఆగాడు.

'తీసుకోండి!' అంది ఓ ప్లేటు అందిస్తూ.

'అబ్బే ఇవన్నీ ఎందుకండి?. ..' అన్నాడు నసుగుతూ నవ్వుతూ.

'తినటానికండి.....ఊఁ! నాకు మహా చెడ్డ ఆకలి వేస్తోంది. మీతోటా మీరు త్వరగా తింటే మేలు లేకపోతే అది కూడా స్వాహా '

గిరి రెండు కప్పుల కాఫీ తెప్పించాడు

బండి కదలబోతుంటే ద్రాక్షపళ్ళుకొన్నారు. గిరి ద్రాక్షకేసి, ఆమెకేసి చూపులు మార్చాడు.

'ఏమిటోయ్ గిరిరాజ్! అంతదీక్షగా చూస్తున్నావ్?' అన్నాడు లోపలి గిరి.

'ఆ అమ్మాయి కళ్ళు ద్రాక్షపళ్ళలా వున్నాయి ఆ సౌందర్యాన్ని చూస్తున్నా.....' అనేసి తనెవరితో మాట్లాడుతున్నది తెలిసిరాగానే చటుక్కున నాలిక్కరచుకున్నాడు

'నన్నుక్షమించు. ఏదో బుద్ధి గడ్డితిని, తన్మయత్వంలో ఎవరితో మాట్లాడుతున్నదో తెలియక ఏదో అనేశాను' అన్నాడు ఏడుపు కంఠంతో. లోపలి గిరి నవ్వాడు

'నువ్వు దాచినా దాగదోయ్! ..నేను నీ అంతరాత్మని. జాగ్రత్త!' అంటూ గుండెలో దాక్కున్నాడు.

గౌరి ఏదో కాగితాన్ని కిటికీలోంచి బయటకు విసురుతుంటే, గిరి ముందు కెగిరి కాగితాన్నందుకున్నాడు. ముడతలు సరిచేసి మడిచి జేబులో పెట్టుకున్నాడు

'ఇదేమిటండోయ్?. .పిచ్చెక్కిందా ఏమిటి?'

'ఓ వస్తువుమీదకాని — విషయంమీదకాని—అతిథికి మించిన ఆశ వుంచితే — శ్రద్ధ చూపితే—అది కూడా పిచ్చే. క్రికెట్ అంటే నాకు ప్రాణం. ఆ కాగితంలో లెన్‌హటన్ ఫోటోవుంది లేట్ కట్ చేస్తుంటే తీసిన ఫోటో. దాన్ని మీరలా విసిరివేయటం సంహించలేక తీసుకున్నాను. గౌరి నవ్వింది. విరగబడి నవ్వింది. ఏదో గిరంత హాస్యాన్ని కనుక్కున్నట్లు మరింత విరగబడి నవ్వింది.

'ఏం? ఏం? ఎందుకిలా నవ్వుతున్నారు?'

'ఏంలేదు మీరింతగా ప్రేమిస్తున్న ఆటలో ఏముందాని ఆలోచిస్తున్నా ఎండలో మల మల మాడిపోతూ నిమిషానికోసారి బంతికోసం ఎదురు చూస్తూ పాపం చేసినవాడిలా నిలబడటం—ఎంతో ధీమాగా, పర్వతాన్ని పెకలించటానికన్నట్లు బయలు దేరటం మొదటి బంతికే తిరిగిరావటం చూసే వాళ్ళ కసలు మతి లేదంటాను .. .'

ఆమె ఇంకా చెబుతూనే వుంది గిరి వినిపించుకోటం మానేశాడు ఓమాటు తోటి విద్యార్థి 'క్రికెట్ అంటే — ఇరవై ఇద్దరు మూర్ఖులు ఆడేది. ఇరవై వేలమంది మూర్ఖులు చూసేది! అంటే చెంప చెళ్ళుమనిపించాడు. వ్యవహారం ప్రిన్సిపాలుదాకా వెళ్ళింది. క్షమాపణ చెప్పుకోటంలో అఖరైంది. గౌరిమీద బలప్రయోగం తగదు తగదు. అందుకు కారణాలు ముఖ్యమైనవి మూడు. మొదటి కారణం ఆమె స్త్రీ. రెండోది పరాయి మగాడి భార్య. మూడోది ఆ పరాయి మొగాడు తన ప్రియమిత్రుడు.

'రెండుసార్లు సహించాను ఇక మూడోసారి ప్రతి అసాధ్యం' అనుకున్నాడు గిరి.

'దయవుంచి మీరు క్రికెట్ గురించి నా దగ్గర ఏమీ మాట్లాడకండి. మీ కిష్టం లేనంతమాత్రాన దాని విలువ నశించదు. అభిమానించేవారు కోట్లకొలది వుండగా, ఎడారిలో నీటి బొట్టులా మీ మాట ఇంకిపోతుంది. దాన్నెవరూ వినరు . ..ప్లీజ్! ... ఇకముందు ఆటాపిక్ వద్దు.'

'గౌరి ఆశ్చర్యంతో కళ్లెత్తి చూసింది అతని మాటల్లో ప్రతి అక్షరమూ నిండుగా ధ్వనించింది. కళ్ళల్లో నిశ్చితమైన అభిప్రాయం కనపడింది. ఆ క్షణంలో గిరి ఓ సిద్ధాంతవాదిలా కనిపించాడు. మనసులో మాటను ఖండితంగా మాటగా చెప్పే అతని తీరు తెన్నులు ఆమె నాకర్షించాయి.

'క్షమించండి. మీ మనసును కష్టపెట్టడం నా అభిప్రాయంకాదు. మీరింత సీరియస్‌గా తీసుకుంటారని తెలిస్తే నోరు మూసుకుందును.

గిరి సమాధానం చెప్పక 'అంతా మర్చిపోండి' అన్నట్లు చూశాడు. మరో పది నిమిషాలు గడిచాయి.

'మీ ఆవిడ బెజవాడలో వుందాండి ?... ఆమె నోమారు చూపించరూ?' గిరి గతుక్కుమన్నాడు. అది రూపంలేని ప్రశ్న.

'మీ. ...మీ....మన్నారు?'

గౌరి కొంటె కళ్ళతో కలుక్కుమంది. 'బావి అమాంతం పట్టుకున్న వాడిలా వెంటేలు పడిపోతు న్నావేమిటి ఈ అబ్బాయి?' అనుకుంది.

'మీ ఆవిణ్ణి మాడకూడదా ఏమిటి?.... అలా ఎందుకు కంగారుపడతారు?'

'నాకు పెళ్ళైందని మీ కెవరు చెప్పారు?'

గౌరి కళ్ళు పెద్దవి చేసింది

"నేనే వూహించి పొరబడ్డాను. గత పదిహేను రోజులనుండి ఆయన మీకోసం సంబంధాలు వెతుకుతున్నాయనే నాకు తెలుసు. ఒక్కసారి..." ఆగి మళ్ళా నవ్వింది

'హరి చెప్పిన మాటలు నిజమే కాని ఇప్పట్లో అలాంటి ఆలోచనలేదు'

'ఎందుగేత?' అంది అదోలా చూస్తూ.

"నా అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారనే ఇదంతా చెబుతున్నా ప్రతి మనిషికి కొన్ని లక్ష్యా లుంటాయి. అవన్నీ నెరవేరాలంటే అతనికి స్వా తంత్ర్యం అవసరం. ఏ సమయంలో ఎలాంటి సాహస చర్యలు చేయవలసి వస్తుందో అతనికే తెలి యుదు. అందుచేత ఎలాంటి బాధ్యతలు, బరువులు వుండకూడదు. భార్యవుంటే, ఆమె తనుగుణంగా మనసు ఎరగకుండా నడుచుకోవాలి. ఏ పని చేసే ముందైనా ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి వివాహం అభివృద్ధికి ఆటంకం. గమ్యస్థానం చేరు కున్నాక పెళ్ళి చేసుకోటం మంచిది ..'

గౌరి శ్రద్ధగా విన్నట్లే కనపడింది ఆ పెట్టె లో ఎక్కువమంది ప్రయాణీకులులేరు స్వేచ్ఛగా మాట్లాడుకునేందుకు ఆటంకాలులేవు

'నిజమే కావచ్చు కాని, మీ లక్ష్యం—లేక లక్ష్యాలు ఏవిటో కాస్త చెప్పండి'

'ఉద్యోగరీత్యా అంతా వుత్సాహకరంగానే వుంది క్రికెట్ ఆటలో అగ్రస్థానం అందుకోవాలి. టెస్టులో ఆడాలి. అభిమానులు ఆదరించాలి. అప్పటిక్కాని నా లక్ష్యం నెరవేరదు...ఏం?....ఎందుకు నవ్వు తున్నారు? అంత హాస్యపూరితంగా వుందా? నవ్వ కోండి. ..నాకేం అభ్యంతరంలేదు.'

'నెమ్మళ్ళ నేనాకోసం చేస్తున్నాననుకోకండి. మీరు క్రికెట్ ఆడితే మీ భార్యవద్దంటుందా? పైగా మిమ్మల్ని గౌరవిస్తే ఆమె ఏడుస్తుందా? పెళ్ళికి, దీనికివున్న సంబంధం నాకర్థంకావటం లేదు'

'ఇంత స్పష్టంగా చెప్పినా మీ కర్థం కానందుకు చాలా బాధపడుతున్నా ప్రతినెలా టూరు వెడితే పెళ్ళాం ఎగిరిపడదటండీ?'

'అది కూడా నిజం కావచ్చు మీరు గొప్ప ఆట గాళ్ళయ్యాక పెళ్ళి చేసుకున్నారనుకోండి అప్పుడు మాత్రం ఇంట్లో శాశ్వతంగా వుండగలరా ఏవిటి? పెళ్ళి కాగానే ఆటకు ఫుల్‌స్టాప్ పెడతారా?'

గిరి గతుక్కుమన్నాడు

గౌరి గర్వంగా గెలుపు నవ్వు నవ్వింది.

అంతటితో సంభాషణ ఆగింది

గిరి నాన్నకు రాసిన పదహారు వుత్తరాల్లో ఇదే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ వచ్చాడు ఇలాంటి ఎదురు ప్రశ్న నెవరూ వేయలేదు. తన లక్ష్యంలో లోపం వుందనలేదు. గౌరి మాటలు నిజమనిపిం చాయి. వివాహం జీవితానికి అంతిమ ఘట్టం, ఆటుకోటం పొరపాటు కాదేమో!

లోపలి గిరి నవ్వుతూవచ్చి నిలబడ్డాడు గిరి ఆశ్చర్యపోయాడు.

అతనికి జ్ఞాపకం వున్నంతవరకూ లోపలిగిరి నవ్విన పాపాన పోలేదు.

'ఏమయ్యా! ఏం అపరాధం చేశాను? మళ్ళీ వచ్చావ్" అని విసుక్కున్నాడు.

'నీ టక్కరి వేషాలు నా దగ్గర సాగవుసుమా! ఆ అమ్మాయి గురించే ఆలోచించి మనసెందుకు పాడుచేసుకుంటావ్? ఆమెను పెళ్ళి చేసుకుంటావా ఏమిటి అసలు పెళ్ళంటే నీకు కిట్టదుగా!'

ఇన్నాళ్ళూ అలాగే అనుకున్నా కాని గౌరిని చూశాక, ఆమెమాటలు విన్నాక ఆఅభిప్రాయం మార్చుకోవాలను కుంటూను. గౌరిని చేసుకోటం ఎలాగూ వీలుపడదు. ఆమెలాంటి అమ్మాయినైనా చేసుకోవాలని నిర్ణ యించుకున్నా'

'శేష్! బాగుంది గిరిరాజ్! వివాహమంటే వైతరణి దాటటమనేవాడివి. ఒక్కక్రీగంటి చూపులో ఐస్‌క్రీంలా కరగిపోయావు ఆలస్యం అమృతం విషం. మీ నాన్న కుత్తరం రాయి.'

'తొందరపడకూడదు గౌరిలాంటి అమ్మాయిని నేను వెతుక్కుంటా. నాన్న కుదిర్చే సంబంధాలు నాకు నచ్చకపోవచ్చు'

'శుభస్యశీఘ్రం!' అని ఆశీర్వదించి స్వస్థలం చేరుకున్నాడు లోపలి గిరి

గౌరి కిటికీకి జారబడి నిద్రలో మునిగిపోయింది.

గిరి విచిత్రమైన వూహల మధ్య చిక్కుకున్నాడు

* * *

మద్రాసు వచ్చేసింది

'అన్నట్టు అడగటం మర్చిపోయాను. మిమ్మల్ని తీసికెళ్ళేందుకు స్టేషనుకెవరు వస్తారు?'

'ఎవరైనా వస్తారు. చూద్దాం' అంది ప్లాటుఫారంలో అడుగుపెడుతూ.

రెండు నిమిషాల్లో నవ్వుగా పొడుగ్గావున్న ఓ వ్యక్తి వచ్చాడు. గిరి తెల్లబోయాడు అతను నిజాన్ని నిజంగా నమ్మే స్థితిలోలేడు.

'నరహరి! .....నువ్వెక్కణ్ణుంచి దిగబడ్డావ్?'

'ముందు బయటికి పోదాం — తరువాత వివ రాలు'

బయట కారు రెడీగా వుంది.

'ఏం అలా చూస్తున్నావ్? కారు మన సొంతం కాదులే! కంపెనీ సొత్తు! కారు కదిలింది.

'గౌరి! .మన గిరి చాలా మంచివాడు ఉత్తరం రాయగానే సాయపడ్డాడు గౌరి నిజమన్నట్లు తల వూపింది.

'నన్ను వస్పెన్సులోవుంచి చంపుతున్నావ్ నువ్వు మద్రాసు ఎప్పుడు వచ్చావ్? ఎలా? మచిలీపట్నం నుండి మొన్ననేకదా ఉత్తరం రాశావు' నరహరి నవ్వాడు.

అంతా ఒకసారే చెప్తే గుండాగిపోతుందని కొంచెం కొంచెంగా చెప్తాను. మచిలీపట్నం ఎలా వుంటుందో ఇంతవరకూ నాకు తెలియదు నేను బి. ఏ పూర్తిచేసి మద్రాసులో ఉద్యోగంలో చేరాను. ఇక్కడే వుంటున్నా.

"మరి మీ ఆవిడ అక్కడే వుంటోందా?'

'లేదే! ఆవిడ కూడా నాతోపాటు ఇక్కడే!'

గిరికి తల గిరగిర తిరిగింది.

'హరి ఇదంతా ఏవిటి? నిజం చెప్పు' అన్నాడు ప్రాధేయపడుతూ.

'నిన్ను మోసం చేశానని మాత్రం అనుకోకు. చెప్పేదంతా విని నన్ను క్షమించు. అంతా నీ మంచి కోసమే! మీనాన్నగారిని అయిదుసార్లు కలుసుకున్నాను. నీపెళ్ళిగురించి బెంగపెట్టుకున్నారు నువ్వుపక్కదారులు తొక్కావేమోనని అనుమానపడ్డారు కూడా. నాలుగు రోజుల్లో నీ మనసు మారుస్తానని ఆయనకు మాటిచ్చాను 'ఎలాగా' అని ఆలోచిస్తుంటే మరద లుపిల్ల మచిలీపట్నంనుండి వస్తానంది. మద్రా సు చూడాలనుందట—ఇదే అవకాశమని నీకు ఉత్తరం రాశాను నువ్వు కవరుమీద తపాలా ముద్ర చూడ లేదు. నా పథకం నెరవేరింది'

గిరి గౌరికేసి ధైర్యంగా చూశాడు. ఆమె ఎక్కడలేని సిగ్గుతో తలవంచుకుని కాబోయే క్రికెట్‌వీరుణ్ణి క్రీగంటితో చూసింది.

"అయితే గౌరి నీ భార్య కాదన్నమాట! ..."

"కాదయ్యాకాదు! ఆమె నా మరదలు. ఇంటరు పూర్తి చేసింది సంబంధాలకోసం చూస్తున్నారు మీ నాన్నగారు ఆమెనిదివరకే చూశారు. ఆయన అంగీకారం ఏనాడో వుంది. మరి నీ అభిప్రాయం తెలి యాలి."

'నా మనసు మారుతుందని నువ్వు ముందే ఎలా వూహించగలిగావ్?'

'గౌరి ఎలాంటి పిల్లో నాకు తెలుసు చమత్కారం, కొంటెతనం—ఎదుటివాణ్ణి ఏడిపించటం—ఇవన్నీ ఆమెకు ఉబుసు పోకలు. తల్చుకుంటే ఎంత పనైనా చేస్తుందని నాకు తెలుసు ఆమె ముందు నువ్వు ఓడిపోక తప్పదు .'గౌరి' అనే అస్త్రం చేత 'క్రికెట్' అనే రాక్షసుడిని సంహరించాను ... అలా అని గౌరి గయ్యాళి కాదుసుమా! అణకువ— నమ్రత అన్నీ వున్నాయి

లోపలిగిరి పరుగెత్తుకు వచ్చాడు

'ఇంకా ఆలోచిస్తున్నావేమయ్యా! నాతో అన్నా వుగా గౌరిలాంటి అమ్మాయిని చేసుకుంటానని. వెంటనే ఒప్పేసుకో. ప్రతిసారి నిన్ను హెచ్చరిస్తూ కాపలా కాస్తూ నా తల ప్రాణం తోక కొస్తోంది.

ఆ గడుసరి గడుగ్గాయ నీ సంగతి చూసుకుం టుంది నేను కొంతకాలమైనా విశ్రాంతి తీసు కుంటాను'

'సరే సరే .నువ్వెళ్ళు'అన్నాడు గిరి.

'గిరి! నా ప్రశ్నకు సమాధానం? ....'

మా నాన్న కిష్టమైతే నాకూ ఇష్టమే!' అన్నాడు.

'అదీ మాట! అదృష్టవంతుడివి' అంటూ గట్టిగా వీపు చరిచాడు. డ్రైవరు వులిక్కిపడి కోపంగా వెనక్కి తిరిగి చూశాడు

ముగ్గురూ నవ్వుకున్నారు.

* * *

మరోక్కవిషయం.

ఆ మర్నాడు గిరి ఫైనల్సులో ఆడాడు మొదటి బంతికే అవుట్! కానతను బాధపడలేదు. నవ్వు కుంటూ వెనక్కి తిరిగి వచ్చాడు బంతి ఎదురు వస్తున్నప్పుడు గౌరినిగురించి ఆలోచిస్తే అవుట్ కాక ఏమవుతాడు? ★